
# ఇజ్జతో




ఐవియస్. అచ్యుతవల్లి

"తలనిండా పచ్చటి ముద్దబంతిపూలు ముడుచుకుంది. సవరం పెట్టి బిగుతుగా వేసిన జడ చివరన పూసలతో కుట్టిన జడకుప్పెలు పెట్టింది. చింతాకంత వెడల్పు కాటుక, నయాపైస అంత సిందూరం బొట్టు, పల్చటి నైలాన్ వోణీ మంచి ముదురురంగు లంగా బాక్ బటన్స్ వున్న జాకెట్టు, "ఎందు కిదంతా?" నవ్వింది వసుమతి. రామం. అన్నాడు "పూర్తి డిస్క్రిప్షన్ ఇయ్యనీ మరి! మధ్యలో బ్రేక్ వెయ్యకు."

"అవును. ఎందుకు దాని సింగారం అంతా నాకు వర్ణిస్తారు, నేను నమ్ముతాననా? అయినా నా నమ్మకంమీద మీకు ఎందుకు అ ఆరాటం! నేను నెలరోజులుగా వూరిలో లేను. కక్కుర్తిపడితే పడతారు. నాకేంపోయింది మధ్యన!" అంది వసుమతి నవ్వుతూ.

"అదే నాకు బాధ. నిజంగా నేను కక్కుర్తిపడే మాటయితే ఈ గొడవ పట్టించుకోనే పట్టించుకోను. నడివయసు వాడ్ని. నేనేం స్టూడెంట్ కుర్రాడినా?

బాధ్యతగల ప్రభుత్వోద్యోగిని. నిండా పదహారేళ్లు లేని గుంటని. అందులో పని చేసేదాన్ని బలవంతం చేస్తానా! నువ్వే చెప్పు!"

"నేను చెప్పేదేమిటి! మీరు బలవంతం చేయలేదు చేస్తారేమో అని ఎదురుచూసి ఎదురుచూసి మీరు బలవంతం చేయకపోయేసరికి విసుగెత్తి బలవంతం చేసారు బాబో అని వీధి కెక్కింది. దానిది తప్పేముంది! మీరు బలవంతం చేయకపోవటం మీదే తప్పు" అంది వసుమతి. అసలు గొడవ ఇది. వాళ్లు ఆ వూరికి కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చేరు. వసుమతి, రామం. దంపతులు ఇద్దరే వుంటారు. రామంకు మంచి జీతం వస్తుంది. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండు మూడునెలలు బాగానే గడిచాయి. వసుమతి అత్తవారింటికి ఏదో పనిమీద వెళ్ళింది. అక్కడ్నించి ఇంకేదో పని హడావిడిలో వున్నది వారంరోజులలో వద్దామనుకుంది, నెలరోజులయ్యింది. వచ్చేసరికి పనిపిల్ల పనికి రావటంలేదు అన్నాడు రామం. "ఎంచేత?" అంది వసుమతి.

"కారణం నువ్వు వచ్చేక నీతో చెప్పుకుంటానంది" అన్నాడు.

"సరే, అంది. కొత్త పనిపిల్ల కోసం వెతుక్కోవాలి. ప్రాణం ఉసూరు మంటోంది వసుమతికి. వసుమతి వాళ్లు ఇంటిలో దిగిన మర్నాడే అమ్మలు తలుపు తట్టింది. చెవులకు పెద్ద రింగులు ఇత్తడివి. జార్జెటు వోణీ.

"ఎవరు?" ప్రశ్నార్థకంగా చూసింది, వసుమతి

"పాచిపని చేయించుకోరా!" అంది అమ్మలు. దాని వరస చూస్తే సినిమాల్లో ఎక్స్‌ట్రా వేషాలు వేసేదానిలాగుంది కాని పనిపాటులు చేసుకునేమనిషిలా లేదు. "సర్లే. ఎంతిమ్మంటావు?" అన్నది.

"అందర్ని కనుక్కోండి. అంతా ఎల్లాగ ఇస్తే అల్లాగే ఇయ్యండి."

"అదెలా కుదురుతుంది? మా ఇంట్లో పని వేరు కొందరయితే పనివాళ్ల చేత పచ్చళ్లు కూడా రుబ్బించుకుంటారు. నాకు బట్టలుకూడా ఆరెయ్యక్కర్లేదు. అంట్లు తోమేసి గదులు చిమ్మేస్తే సరిపోతుంది" అన్నది వసుమతి.

ఇటూ అటూ కాస్సేపు చూసి ఆలోచించి తల గోక్కుంటూ—

"సరే పదిహేను రూపాయలియ్యండి" అంది. వసుమతి ముఖం చిట్లించింది "ఏం పని వుంది! వంటగిన్నెలు తోమి రెండుగదులు ఊడ్చిపెట్టటానికి పదిహేను రూపాయలా! బలేదానివే! ఎనిమిది రూపాయ లిస్తాను. "చేస్తే చెయ్యి" అంది, వసుమతి చిరాగ్గా. సరే అని ఒప్పుకుంది. వసుమతివాళ్ళు మేడ మీది పోర్షన్లో ఉంటున్నారు. గిన్నెలన్నీ ఒక బకెటులో వేసుకుని క్రిందకు తీసుకు

పోయేది. అందరి గిన్నెలు తోమినాక వెళ్ళిపోయేముందు తోమి పైకి తెచ్చేది, గిన్నెలు

"ఇదేమిటి మాకు వంట అయి భోజనాలు కూడా అయినాయి ఇప్పుడా గిన్నెలు కడగటం!" అంటే "మరి అందరివీ తోముకురావద్దాండీ! వాళ్ల తోమమని పీకలమీద కూర్చుంటారు," అనేది

"నేనూ నీ నెత్తిమీద కూర్చుంటాను, మాకు మటుకు అర్జంట్ కాదా గిన్నెలు! కావల్సినవి అన్నీ కడుగుకున్నాక నువ్వు షోగ్గా వస్తే ఎల్లాగు!" అంది వసుమతి ఒకరోజు తొమ్మిది, ఒకరోజు ఎనిమిది, ఒకరోజు సాయంకాలం ఆరింటికి, నాలుగింటికీ ఇలా తన ఇష్టం వచ్చినట్లు వచ్చేది మానిపించి కొత్త పనిదాన్ని పెట్టుకోవాలని వుండేది, వసుమతికి ఆ వాడ కట్టులో ఎవరితోనూ పరిచయం లేదు. ఎందువల్లో వసుమతికి అందర్నీ రాసుకు పూసుకు తిరగటం ఇష్టం వుండదు తన పని తాను చూసుకోవటం, తీరికవుంటే ఏ పుస్తకమో, రేడియో తోనో కాలక్షేపం చేయటం కొంతమంది కొత్తవూరు వచ్చేసరికి, ఇరుగుపొరుగులతో ఒక వారం పది రోజులలో కత్తు కలిపేస్తారు. వసుమతి వచ్చి నాలుగు నెలలు అయినా ఆమె మితభాషి అవటం వల్ల నించి అట్టే పరిచయాలు కాలేదు ఒక రోజు వీధిలోకి కూరలేమీ రాలేదు. వసుమతికి బద్ధకం వేసింది, బజారుకు పోవటానికి.

"అమ్మలూ ఒక పావు కేజీ బంగాళా దుంపలు తెచ్చిపెట్టు!" అంది 'సర్లెండి' అంది సంచీ డబ్బులూ ఇచ్చింది ఇంకా తెస్తుంది, ఇంకా తెస్తుంది అనుకుంటూ కూర్చుంది. తేలేదు. రామం ఆఫీసునించి ఇంటికి వస్తూనే భార్య ముఖం చూశాడు.

"ఏమిటి అలా వున్నావు?" అన్నాడు

"అమ్మలు " అంది

"ఏమయింది! పాపం చిన్నపిల్ల" అన్నాడు. దానికేదో అయిందని అనుకున్నాడులావుంది. "దానికేమీ కాలేదు. కూర తెమ్మని డబ్బులిచ్చాను. ఇంత వరకూ రాలేదు," అంది

"ఇంక ఇప్పుడేం వస్తుంది! వున్నదేదో వండెయ్యి," అన్నాడు "అసలు ఏమీ లేకనేకదా బజారుకు పంపేను?" అంది విసుక్కుంటూ "పోన్లెద్దూ," అన్నాడు మర్నాడు ఉదయం పనిలోకి రాలేదు మధ్యాహ్నం వచ్చింది "ఏమే నిన్న కూర తెమ్మంటే అదే పోత పోయేవు?" అంది "మర్చిపోయేనండీ" అంది అది మొదలు బ జా రు ప ని చెప్పటం మానేసింది ఒక రోజు వసుమతి బియ్యం ఏరుకుంటూ కూర్చుంది అమ్మలు వచ్చి ప్రక్కన నిలబడింది వసుమతి అడక్కపోయినా క్రింది వాటాల వాళ్ల సంగతులు చెప్పటం మొదలుపెట్టింది వసుమతికి అనవస

రంగా బాతాఖానీ వేసుకుని కూర్చోవటం చిరాకు పైగా ఇరుగు, పొరుగు వాళ్ళ సంగతులు వినటం, అదీ పనిచేసే వాళ్ళ ద్వారా మరీ చిరాకెత్తించేది "వాసే! నాలుగిళ్ళల్లో పన్లు చేసుకునేదానివి! ఇల్లా హస్కు కొడుతూ కూర్చుంటే ఎల్లాగు! మీ అమ్మ మా ఇంట్లో ఏదో ఎక్కువ పనిచేస్తున్నా వనుకుంటుంది. వేగం గిన్నెలు కడిగేసుకుని వెళ్ళిపో,'' అంది అమ్మలు వింతగా చూసింది వసుమతి వైపు ఇంతమంది ఇళ్ళల్లో పన్లు చేస్తోంది అందరూ పొరుగిళ్ళల్లోని తగువులు చెబ్తూంటే చెవులు దోరబెట్టుకుని వినేవారే ఈ అమ్మ ఏమిటో! ఎప్పుడూ కళ్ళజోడు పెట్టుకుని పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటుంది, అని విసుక్కుంది ముఖం చెండుకుని విసవిసలాడుతూ కిందికి వెళ్ళిపోయింది. అమ్మలు పనిచేసే ఇళ్ళవాళ్ళందరూ నడివయస్సు వాళ్లు. చెంపలు నెరిసి పిల్లా జల్లాతో పీకలదాకా సంసారం బండిలో కూరుకుపోయి వున్నవాళ్లు మగవాళ్లు కూరలసంచీలు బియ్యం మూటలు మోస్తూ, ఆడవాళ్లు కలనేత చీరలు కట్టుకుని, పిల్లలకు పురుళ్లూ పుణ్యాలూ పోస్తూ, ఆవకాయలు, మాగాయలూ పెట్టుకుంటూ కాలం గడుపుతూంటారు. వసుమతి ఎప్పుడూ నీటుగా వుంటుంది రామం అప్పుడప్పుడు ఆఫీసర్‌గారి కారులో వస్తూవుంటాడు రామం కూడా చక్కని పాంటులూ, కాస్ట్లీ చొక్కాలూ ధరిస్తూవుంటాడు అమ్మలు వీళ్లింట్లో పన్లు కాక పొరిగింట్లో అద్దెకుండే ఇద్దరు స్టూడెంటు కుర్రాళ్ళకి మంచినీళ్లు తెచ్చి పెట్టటం గది వూడ్చటం చేస్తోంది వాళ్ల హాస్యాలు అడితే కసురుకుంటూ వుండేది ఒకరోజు ఒక కుర్రాడు అన్నాడు—

"ఏమే అమ్మలూ! మీ హీరో ఇవ్వాళ కారు ఎక్కాడే!''

"హీరో ఎవ్వరండీ" అంది.

"అదే మేడాయన"


"ఛ ఛ ఆయన హీరో ఏటండీ! ఏనుగులా బారియ వున్నది" అంది అమ్మలు.

"పిచ్చిదానా ! బారియలున్నవాళ్ళే హీరో ఏసికాలు ఏస్తారు మాలాంటి గుంటెదవలు ఏదన్నా అంటే మీ లాంటోళ్ళు ఓయమ్మో రౌడీసు నాకొడుకులు, అంటూ కితాబు లిచ్చేస్తారు. అల్లాంటి బారియలున్నా ఉద్యోగస్తులయితే కన్ను మలిపితే చాలున్నా, ఎచ్చిగా ఎల్లిపోతారు," అన్నాడు

"వల్లకోండి బాబూ ఎప్పుడూ అల్లాంటి ఊసులే!" అంది జడ ముందుకు వేసుకుంటూ

"ఊసులుతోనే తృప్తి మాకు! హీరోలు అవ్వాలంటే ఈ చదువులు గట్టెక్కాల, ఉద్యోగాలు దొరకాల"

"పెళ్ళిళ్ళు కావాల" అంది అమ్మలు.




“మరే మరే!” అన్నారు ఆ కుర్రాళ్ళు.
అమ్మలు గది వూడుస్తోంది వసుమతి కాఫీ కలుపుతోంది

“అన్ని కప్పులెందుకు !” అన్నాడు రామం.

‘ఎన్నేమిటి మూడేగా !”

“వున్నది మనమేగా ?”

“అమ్మలు గదు లూడ్చుతోంది. దానికీ కొంచెం పోద్దామని” అంది, వసుమతి

“ఏదో మంచి చేసుకో” అంటూ ఇవతలికి వచ్చి —

“అమ్మలూ! నీకు కాఫీ వేడి వుండాలా అక్కర లేదా!” అన్నాడు రామం పలకరించేసరికి అమ్మలు అష్టవంకరలు తిరిగిపోయింది కళ్లు క్రిందికి వాల్చింది.

“మాట్లాడవేమిటి” అన్నాడు

“మీ ఇష్టం అంది మెల్లిగా.
అమ్మలు వెళ్ళిపోయేక అది “మాట్లాడిస్తే అలా బెదిరిపోతూందేమిటి ?” అన్నాడు

“చిన్నపిల్ల కదా !” అంది వసుమతి.

“చిన్న పిల్లలయితే ఇంకా చురుగ్గా వుంటారు. ఇదేమిటి! మరీ ముడుచుకుపోతోంది” అన్నాడు, రామం రామంకు తరుచు కాంపులు వుంటూ వుంటాయి వసుమతి ఇంట్లో ఏక్ నిరంజన్‌గా వుంటూ వుంటుంది

“మీరేం దిగులు పడబోకండి మా బొట్టిని తొంగోమంటే తొంగు టుంది, బాబు లేనప్పుడు ” అంది, అమ్మలు తల్లి. వసుమతికి వంటరిగా వుండటం అలవాటు అయింది రకరకాల కుట్లు వచ్చును ఏదో ఒక చేతిపని పెటుకు

కూర్చుంటుంది లేకపోతే ఇల్లంతా దులిపి కడుగుతుంది చిరిగిన చీరలుంటే కర్టెన్స్ క్రింద కన్వర్ట్ చేస్తుంది. 'తోచదు' అన్న ముక్క వసుమతికి తెలియదు పిల్లలు లేకపోయినా, వసుమతికి,ఇరవయి నాలుగ్గంటల టయిమ్ సరిపోదు "నాకు ప్రక్కన ఎవరయినా పడుకుంటే తోచదు నాకు నీ పిల్ల సాయం అక్కర్లేదు," అంది వసుమతి.

అమ్మలుకి, వసుమతి వూరెళ్ళి నప్పట్నించీ దిగులు దిగులుగా వుంది. దానికి సాయం అ స్టూడెంటు కుర్రాళ్ళ నోరు వూరుకోదు

"అమ్మలూ! ఏనుగు వూరేగింపుకి వెళ్ళినట్లుంది మీ హీరోకి ఇంక పనే ముంటుది! అంతసేపు వుంటున్నావు మేడ మిద"

"ఆ బాబు ఒండుకుంటున్నాడు," అంది

"యురేకా!" అంటూ గావుకేక పెట్టాడు ఒకడు

"ఏమిట్రో అన్నాడు రెండోవాడు.

"క్లూ దొరికింది గురూ!

"దేనికి!"

"అరె! ఆ హీరోగాడి కధకు" అమ్మలు చీపురు పట్టుకొని నించుంది

"ఏమా కధ?"

"వండుకుంటున్నాడు కనుక పనిపిల్ల విధిగా మేడమీదకు రావాల్సివుంటుంది అంట్లు, గిన్నెలు తోమించుకోవాలి కదా! వాడికి ఈ వారఫలంలో కన్యకా పరిష్వంగం వ్రాసి వుంటుంది, చూడు"

'అమ్మలూ నీకేమయినా మిగుల్చు తున్నాడా!' అన్నాడు

"గిన్నె అత్తెసరు పడేసుకు టాడు. సగానికి సగం మిగిల్చి పారేస్తాడు"

"నీకర్థం కాలేదుటే వెర్రికుట్టీ, సగం ఇచ్చాడంటే నీ సగం తన సగం ఒకటి అని అర్థం"

"అంటే ఏటి బాబూ!"

"ఇన్ని సినిమాలు చూస్తున్నావు. ఇంకా జ్ఞానం లేకపోతే ఎట్లాగు?"

"జ్ఞానం లేకపోవటం కాదు రాక పోవటం అని" సమర్థించాడు ఒకడు.

"చూడు హీరో, హీరోయిన్‌కి తలలో పూలు పెట్టడం, సగం కాఫీ ఇయ్యటం ఇవన్నీ సినిమాలలో చూపి య్యరూ! నీకో సగం అన్నం ఇచ్చా డంటే గురూజీ నిన్ను ప్రేమిస్తున్నా డన్నమాట"

అమ్మలు ఆలోచనలో పడింది అమ్మలు చాలా సినిమాలు చూసింది. ప్రతి సినిమాలోనూ ఈరోయిన్ పేద దయి వుంటుంది పెద్ద మేడ తుడుస్తూ వుంటుంది హీరో ఈరోయిన్ విదిలించి కొట్టూన్నా చుట్టూ తిరుగుతాడు అల్లరి చేస్తాడు ఆటలు పట్టిస్తాడు చివరికి ఈరోయిన్ ప్రేమిస్తుంది ముందు తల్లి తండ్రులు వద్దన్నా చివరికి ఈరోయిన్ మంచిదని గుర్తించుతారు. వాళ్ళ కోడల్ని

చేసుకుంటారు. రామం నడివయస్సు వాడిలా కన్పించడు. కాయబారు శరీరం కావటంతో ఆకర్షణీయంగా వుంటాడు. రామం ముందు వసుమతి తీసికట్టుగానే వుంటుంది కారులో వస్తూ పోతూవుంటే కళ్ళప్పగించటం అమ్మలు వ తయింది వసుమతి వూరువెళ్ళి వారంపది రోజు లవుతోంది రామంకు వసుమతి లేకపోతే తోచదు ఇంటిని కనిపెట్టుకుని కాపలా కాస్తుంది రామం ఎక్కడి వస్తువులు అక్కడ పడవేస్తాడు అవి అన్నీ సర్దుతూ వుంటుంది వసుమతి వసుమతి లేక అమ్మలుచేత గదులూడ్పించటం అంట్లు తోమించటం అన్నీ రామం చేయించ వలసిరావటంచేత అమ్మలుతో డైరెక్టుగా మాట్లాడక తప్పలేదు రామానికి. ఇంక అమ్మలు రోజుకో రకంగా అలంక రించుకొని వచ్చేది, అవసరం వున్నా లేకపోయినా

"అమ్మగారు ఎప్పుడు వస్తారు బాబూ !" అంటూ వుండేది. పక్క దుప్పటి దుమ్ములేక పోయినా దులిపి వేస్తూండేది

"బియ్యం ఏరిన వి వున్నయా బాబూ !" అనేది

"లేకపోతే ఇటియ్యండి ఏరి ఇస్తాను అనేది పాపం, చిన్నపిల్ల అయినా ఓరిమిరికల పిల్ల, అనుకునే వాడు రామం అమ్మలుని అవతల స్టూడెంటు కుర్రాళ్ళు అల్లరి పట్టించే వాళ్ళు

"అమ్మలూ ! సంసారంలో కూరుక పోయేవు మమ్మల్ని పట్టించుకోవటం లేదు" అనేవాళ్ళు

"వల్లకొండి బాబూ" అనేది మన సులో రామం అన్నిపనులూ చెబుతున్నాడ చేస్తోంది కాని భుజంమీద చేయి వెయ్యడే? అల్లరిగా ఈ కుర్రాళ్లల్లా మాట్లాడడే? అంట్లు తోమినా, కాఫీ గిన్నెలు కడిగినా, క్రిందనించి నీళ్ళు తెచ్చినా ఎంతకీ పనిఅయినాక వెంటనే సాగనంపటానికి చూస్తాడు తప్ప తిరిగ్గా బాతాఖానీ వేయడేమిటి! వారం అల్లా పదిరోజులు, పదిరోజులల్లా ఇరవయి రోజులు, నెలకావస్తోంది చక్కని సీలింగ్ ఫాన్ సోఫా కం బెడ్, అందమయిన రామం సాహచర్యం, అమ్మలుకళ్ళు కాయలుగాచుతున్నాయి. ఇంక అమ్మగారు రానే వస్తారు ప్చ్ ! విసుగు పుడుతోంది అమ్మలుకి చెప్ప లేని ఉడుకు మోతుతనం, కసి పెల్లుబుకు తున్నాయి, అమ్మలు మనస్సులో. "అమ్మగారు ఎప్పుడు వస్తారు బాబూ !" అంది

"రెండు రోజుల్లో రావొచ్చును బాబు వ్రాసేను బయలుదేరి రావొచ్చును" అన్నాడు టేబులు ముందు కూర్చున్నాడు గడ్డం చేసుకుంటూ యధాలాపంగా ఎదరకు చూసేడు. కుర్చీకీ సోఫాకూ నడుమ బూజు దట్టంగా పట్టి కన్పించింది

"శుభ్రంగా తుడవ్వే ? అమ్మగారు

వచ్చేరంటే, నేను బాగా పనిచేయించ లేదంటుంది," అన్నాడు, రేజర్ తుడుచుకుంటూ

"ఎక్కడండీ!" అంది. "అక్కడే నే!" తలుపు దగ్గరగా లాగింది "ప్చ్ ఇదిగో! కనపడటం లేదూ!" అంటూ లేచి కిటికీ రెక్కవేసి కుర్చీ ముందుకు లాగేడు చీపురు అక్కడే పడేసింది ఒక్క విసురున లేచి ఏటి బాబూ! అల్లా మీది మీదికి ఎగబడ్తున్నారు! మాసెడ్డోరే! నేను అమ్మగారు వస్తేకాని మేడ ఎక్కనే ఎక్కను! మావూ, కూటికి లేకపోయినా గుణానికి లేనోళ్ళంకాదు" మేడ వరండాలో నించుని పెద్ద పెద్ద కేకలు పెట్ట సాగింది స్టూడెంటు కుర్రాళ్ళు గేట్లో తచ్చాడుతున్నారు. రామంకు తల కొట్టేసి నట్లయింది. దీని ముఖం ఈడ్చెయ్యా దీనికేమి వచ్చిందీ రోజు! ఇన్నాళ్ళనించి పనిచేసుకోవటంలేదూ! నా ఖర్మ కాకపోతే దీని వెనకనే పడాలో పడక పడకా! "ముందు క్రిందికి వెళ్ళు" అంటూ హుంకరించాడు ఉత్సాహంగా ముందుకువచ్చేరు స్టూడెంటు కుర్రాళ్ళు

'ఏంజరిగిందేంజరిగింది!' అంటూ ఇరుగుపొరుగు పనిపాటు లేని అమ్మలక్కలు గుజగుజలాడేరు 'మేడాయన' అమ్మలుని చేయిపుచ్చుకుని లాగాడట అని, పది రూపాయిలిచ్చేడట అని ఒకరూ 'అమ్మగారి చీర' కట్టుకోమన్నాడుట అని ఒకరూ, పాపం అమ్మలు అట్లాంటిది కాదు అని ఒకరూ. ఇల్లా రకరకాల వ్యాఖ్యానాలు గాలిలో లేచాయి. రామం తాళంవేసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయేడు స్టూడెంటు కుర్రాళ్ళు "ఏమే అమ్మలూ! లక్కీఛాన్సు ఒదిలేసుకున్నావేమే!" అన్నారు "చక్కగా కారులో షికారు తిరుగుదువు కదా!" అవికూడా అన్నారు.

"నానంటే ఏటనుకున్నారు! నిప్పు! నిప్పులాంటిదాయిని!" అంది గర్వంగా అమ్మలు జడ ముందుకు వేసుకుని

"నిప్పులాంటిదానివి కనుకనే ఆ సుందరాంగుడు నిన్ను వలిచాడు" అన్నాడు ఒకడు సాయంత్రందాకా ఆఫీసులో కూర్చుండిపోయేడు "ఎవరి ముఖం చూసేనబ్బా!" అనుకున్నాడు మహా మహా మంచి వయస్సులో వున్నప్పుడే అమ్మాయిలవెంట పడలేదు ఇంక ఇప్పుడా! సగం వయస్సు అయిపోయింది ఇన్ని వూళ్లూ ఉద్యోగ ధర్మంలో తిరిగాడు ఒకొక్క వూళ్ళో చక్కటి రామచిలుకల్లాంటి స్టెనోలుండే వారు తోటి ఉద్యోగస్థులు అనేవారు—

"ట్రయిల్ వేసుకో గురూ! నీకు ఎన్‌కంబరెన్సెస్ ఏమీ లేవు కదా!" అని

"ఛఛ! తప్పు మన ఇళ్ళల్లో బోలెడు మంది ఆడాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. అంత 'లో లెవెల్'గా మాట్లాడకూడదు" అని మందలించేవాడు భార్య వూరిలో



లేదు వంటరిగా మగవాడు. ఎక్కడయినా ఆడదాన్ని మగవాడు అల్లరిపెట్టటం విన్నాడు కాని, ఆడది అందునా పని చేసుకునేదానికింత తెలివి ఎందుకు వచ్చింది! ఒక గౌరవనీయుడైన ఉద్యోగిని వీధిలోకి లాగటంవల్ల దానికి వచ్చే ఫలితం ఏమిటి! రామం సతమత మయిపోయేడు. వసుమతి వచ్చేదాకా రామం మతి మతిలో లేదు. వసుమతి రాగానే చెప్పాడు. భర్తముఖం చూస్తే వసుమతికి నవ్వువచ్చింది. తాయిలం కాకి ఎత్తుకుపోతే తల్లితో చెప్పి బిక్కముఖంవేసే కుర్రాడు గుర్తుకు వచ్చేడు వసుమతికి

"నెలరోజులూ అది మీ పొందుకోసం తహతహలాడింది. మీరు అపర

ఋష్యశృంగుడులా కూర్చున్నారు. దానితో అది ఇలా రెచ్చిపోయింది. మా బాగా చేసింది

"అల్లా యాగీచేసుకున్నందువల్ల దాని కేమి లాభం! మన గౌరవం పోగొట్టటం తప్ప!"

ఒకళ్ళమీద గౌరవం ఒకళ్లు ఎన్నడూ పోగొట్టలేరు దానికా ఇల్లాంటి అవక తవక పనులవల్ల అబ్బో, అమ్మలు నీతి మంతురాలు అనుకుంటారనే వూహ వచ్చివుంటుంది కాని అది సరికాదు నిజంగా నీతిమంతురాలు అయితే మీరు నిజంగా ఏమన్నా చేయబోయినా సిగ్గుపడి పోయి ఇంటికి వెళ్ళిపోతుంది అంతే కాని ఫలానావాడు నన్ను చేయిపట్టుకు లాగాడు అని అదొక తన అందానికి క్వాలిఫికేషన్‌లా చెప్పుకోదు వీధిన పడటం మనకెంత అగౌరవమో, దానికి అంతకు పదిరెట్లు అగౌరవము" అంది వసుమతి.

"అయినా నాకేం ఖర్మ చెప్పు! రేటు కొద్దీ మనుషులు దొరికే మహాపట్నం. వందరూపాయలు మనవి కావనుకుంటే ఎడ్యుకేటెడ్ గరల్స్ కూడా లాడ్జింగ్ లోకి వస్తున్న రోజులు నాకు ఇదా చెలిమికత్తె! ఖర్మ కాకపోతే!"

"మీరు వూరికే బెంగపెట్టుకోకండి అది అందరి దృష్టీ తనమీద కేంద్రీకరించటానికి చేసిన ప్రయత్నంలో మీరు ఒక సాధనం. అంతకన్న మరేమీ కాదు" అంది వసుమతి

"కాని మీ ఆడవాళ్ళు చెవులు కొరుక్కుంటూ వుంటారు కదా!" అన్నాడు బెంగగా రామం

"నా చెవులు ఎవరూ కొరకలేరు. మనిద్దరిలో ఒకరిమీద ఒకరికి గౌరవం సడలిపోనంతవరకు వేయిమంది అమ్మలు అంతా వచ్చి గోపీలోలుడయినారని చెప్పినా ఫరవాలేదు అదే లేనప్పుడు ఎవ్వరూ ఏమీ చెప్పనవసరం లేకుండానే మనం తన్నుకు చావొచ్చు. దాంపత్య బంధానికి పరస్పర గౌరవం ముఖ్యం! ఇతర లోటుపాట్లు ఎన్నయినా వుండ నీయండి పరస్పరం గౌరవం వుంటే ఆ దంపతులను ఏ మిథ్యాపవాదాలూ విడదీయ లేవు" అంది వసుమతి.

మర్నాడు అమ్మలు వచ్చింది. దాని తల్లి వచ్చింది

"అయ్యగారు చెప్పారో లేదో కానీండి!" అంటూ నసపెట్టూ తన కూతుర్ని ఏదో చేయబోయిన సంగతి చెప్పుకొచ్చింది

"అది వయసులో వున్న పిల్ల! ఇరవయి ఏళ్లయి సంసారం చేస్తూన్న అయ్యగారికే చిలిపితనం పుట్టింది ఇంక స్టూడెంట్ కుర్రాళ్లు వూరుకుంటారా! దాన్ని పనివంకన ఇళ్ళమ్మట తిప్పకు. చెడ్డపేరు వస్తే, వాడుకుందుకు ముందుకు వస్తారు కానీ ఆదుకుందుకు ఎవ్వరూ ముందుకు రారు. ఆడపిల్లా అగ్గిపుల్లా ఒకటి! అగ్గిపుల్ల గీసి అజాగ్రత్తగా

పారేస్తే కొంపలే అంటుకుంటాయి. వయసులో వున్న ఆడపిల్ల ఇంట్లోవుంటే చెంగుకి నిప్పునికట్టుకున్నట్లే పిచ్చిదానా!" అంది వసుమతి

"కావల్సివస్తే అయ్యగార్ని ప్రమాణం చేయమనండి" అంది అమ్మలు, మూతిముడిచి

"ఇరవయి ఏళ్ళనాడు చేసారు, అయ్యగారు ప్రమాణం ఇప్పుడు కొత్తగా మళ్ళీ చేయక్కర్లేదు కన్నకూతురు నీకెలా అబద్ధం చెప్పలేదో, కట్టుకున్న భర్త నాకూ అల్లానే అబద్ధం చెప్పరు, అని తెలుసుకొండి" అంది వసుమతి

వాళ్ళు వెళ్ళిపోయేక 'నీకు నా మీద నమ్మకమేనా వసూ!' అన్నాడు, రామం

"ఆఁ అంత అవసరం ఏముంది! నువ్వు నెల్లాల్లు వూరిలో లేవు. ఆడది కావాలనిపించింది. పిలిచావు, అంటారు తప్పేముంది! ఇష్టం వుంటే వస్తుంది లేకపోతే పోతుంది అంతేకదా! నాతో అబద్ధం చెప్పి దాచుకోవాల్సినంత అపురూపమయిన అనుభవం, అదియ్యకలదా!"

"ఛ ఛ!" అన్నాడు రామం

"నాకు తెలుసును తల్లీ కూతుళ్ళు మిమ్మల్ని వలలోకి లాగాలని చూసేరు. కాని పడలేదు. నిరాదరణ సహించలేక పోయేరు," అంది

"ఎంతటి వాళ్ళయినా వుంటారు"

"ఉదర నిమిత్తం బహుకృత వేషం. అందులో ఇదొక రకం!" అంది వసుమతి.

"ఈ పనివల్ల దానికి లేని గౌరవం వచ్చింది. మనకి వున్న గౌరవం పూడింది"

"ఏం గౌరవమండీ బాబూ! నిజంగా మీకు గౌరవమే కావల్సివుంటే, దాన్ని పెళ్ళి చేసుకోమంటుంది చేసుకుంటారా?"

"నీకు మతిపోయింది దానికీ నాకూ పెళ్ళేమిటి!"

"మరి లేకపోతే ఏంచేస్తారు! దాని ట్రిక్ అది చేసింది మనం అల్లా నోరు మూసుకు కూర్చోవటమే ఉత్తమం

"అంతేనంటావా!"

"అంతే! లేకపోతే ద్వితీయం తప్పదు"

"ఛ ఛ! అల్లాంటి మాట అనకు."

"అయితే మౌనమే భూషణం. వూరుకోండి"

"సరే" అన్నాడు రామం